సాక్షి
కామారెడ్డి
శనివారం, 3, ఆగస్టు, 2024



అధ్వానంగా బడి

నాగిరెడ్డిపేట మండలంలోని రామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸



అగ్నిప్రమాదాలపై అవగాహన

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /23.1

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నాం'

కామారెడ్డి అర్బన్: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్టు ఎస్ఈ రమేశ్‌బాబు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3,560 కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే అగ్రికల్చర్ పోర్టల్‌లో తనిఖీ చేసుకున్న అనంతరం సంప్రదించాలని సూచించారు. పొలంబాట చేపట్టి వంగిన, వేలాడే వైర్లను సరిచేస్తున్నామని పేర్కొన్నారు.

పలువురు ఎస్సైలకు స్థానచలనం

కామారెడ్డి క్రైం: జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్సైలకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్, సిరిసిల్ల జిల్లాల నుంచి నలుగురు ఎస్సైలు జిల్లాకు వచ్చారు. వారిలో దోమకొండకు ఆంజనేయులు, రాజంపేటకు పుష్పరాజ్, రామారెడ్డికి నరేష్, సదాశివనగర్‌కు రంజిత్‌లను కేటాయించారు. ఇప్పటి వరకు రామారెడ్డి ఎస్సైగా పనిచేస్తున్న విజయ్‌ను మద్నూర్‌కు, సదాశివనగర్ ఎస్సై రాజును పిట్లంకు బదిలీ చేశారు. ఆయా చోట్ల కొత్తగా వచ్చిన ఎస్సైలు శుక్రవారమే బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్ -14, 16, 18, 20 మెన్, ఉమెన్ విభాగాలలో ఎంపిక పోటీలు సాగాయి. 18 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు:
కె.సంకేత్, కె.ప్రవీణ్, జి.జగదీష్, ఎస్.శ్రీను, కె.సునీత, ఎం.శ్రావ్య, ఎస్.నితిన్, కె.లక్ష్మణ్, ఎం.బలరాం, ఎ.నక్షత్ర, వై.అశ్విని, కె.నందిని, ఎం.శివకుమార్, బి.ఈశ్వరప్రసాద్, ఆర్.దుర్గేష్, ఎం.మంజుల, ఎ.విజయ్, బి.రాంసింగ్.

కామారెడ్డి డీఆర్డీవోగా సురేందర్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఆర్డీవోగా సురేందర్ నియమితులయ్యారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న ఆయనను కామారెడ్డి డీఆర్డీవోగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. డీఆర్డీవో పోస్టు కొన్నాళ్లుగా ఖాళీగా ఉంది. జెడ్పీ సీఈవో చందర్ నాయక్ ఇన్‌చార్జి డీఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభలో వీధిరౌడీలా వ్యవహరించిన తీరు జుగుప్సాకరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు విషయ అవగాహన లేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, సభా మర్యాదలను, సభా గౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ మంటగలిపిందని విరుచుకుపడ్డారు. యథారాజా తథా ప్రజా అన్నట్టు ముఖ్యమంత్రి ప్రవర్తనకు ఏ మాత్రం తగ్గకుండా వారి ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'అది బోగస్ క్యాలెండర్'
కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా శాసనసభలో రిలీజ్ చేసింది జాబ్ క్యాలెండర్ కాదని.. జాబ్‌ల సంఖ్య లేని బోగస్ క్యాలెండర్ అని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌పై సభలో చర్చ జరపాలని కోరితే కేవలం తేదీలు ప్రకటించి తప్పించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు కూడా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్లని గుర్తు చేశారు.

ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ బదిలీ

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ యస్మిన్ భాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కరీంనగర్‌లో పని చేస్తున్న శ్రీనివాస్ జిల్లాకు రానున్నారు.

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లో..!?

రాష్ట్రంలో సుమారు దశాబ్దం తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చినందున కష్టపడి పనిచేసినవారికి గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆశించారు. నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని గాడ్‌ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

- ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు.. ఊహల్లో ఆశావహులు
- అవకాశం కోసం గాడ్‌ఫాదర్ల చుట్టూ చక్కర్లు
- కాలం కరిగిపోతోందంటూ ఆవేదన



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావడంతో పార్టీ నేతలు నామినేటెడ్ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీతోనే ఉంటున్నవారు తగిన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర స్థాయి పదవుల కోసం కొందరు, జిల్లా స్థాయి పదవుల కోసం ఇంకొందరు, మార్కెట్ కమిటీలు, సీడీసీలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఆలయాల అభివృద్ధి కమిటీలు వంటి పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇద్దరితోనే సరి..
కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొంత కాలానికి ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీని నియమించారు. తర్వాత కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో భాగంగా బాన్సువాడకు చెందిన పార్టీ సీనియర్ నేత కాసుల బాల్‌రాజుకు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా పదవి కట్టబెట్టారు. ఈ తర్వాత ఎలాంటి నియామకాలు జరగలేదు. దీంతో పదవుల కోసం ఆశలు పెట్టుకున్న నేతలు నిరాశ చెందుతున్నారు.

రవీందర్‌రెడ్డి పరిస్థితేంటి?
అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ వస్తున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. రవీందర్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగిస్తారా? వేరే నియోజకవర్గానికి పంపిస్తారా? అన్నదానిపై స్పష్టత లేదు. తనను నమ్ముకున్న కార్యకర్తల కోసం బాన్సువాడలోనే ఉంటానని రవీందర్‌రెడ్డి పేర్కొంటున్నారు. ఆయనకు అధికారిక పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నారు.

కష్టపడ్డవారికే ప్రాధాన్యత?
నామినేటెడ్ పదవుల భర్తీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఎవరెవరు కష్టపడ్డారు? ఎవరు పనిచేయలేదన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తమ గ్రామాల్లో వచ్చిన ఓట్లు, తాము చేసిన పనిని గురించి పలువురు నాయకులు చెప్పుకునే ప్రయత్నాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నియోజకవర్గంలో ఎవరెవరు సహకరించారన్న దానిపై సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి నివేదిక ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ నివేదికను పరిగణనలోకి తీసుకుంటే పదవులు ఎవరికి దక్కుతాయన్న దానిపై పార్టీలో చర్చ నడుస్తోంది.

శ్రావణంలోనైనా బలమొచ్చేనా?

పదవుల పందేరం కోసం ఎదురుచూస్తున్న నేతలు శ్రావణ మాసంలోనైనా నామినేటెడ్ పదవులకు మోక్షం లభిస్తుందేమోనని ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కుదురుకునేలోపే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అందరూ ఎన్నికల పనుల్లో బిజీ అయ్యారు. ఆ ఎన్నికలు పూర్తయ్యాక రాష్ట్ర స్థాయిలో కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. అసెంబ్లీ సమావేశాలు, ఇతర కార్యక్రమాలతో నామినేటెడ్ పదవుల భర్తీ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్కారు సమాయత్తమవుతుండడంతో ఆలోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తారని ఆశావహులు ఆశిస్తున్నారు.

ఆశావహులెందరో?

కామారెడ్డికి చెందిన డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన తన గాడ్‌ఫాదర్ షబ్బీర్ అలీ ద్వారా ప్రయత్నించారు. మొదటి విడతలోనే తనకు అవకాశం దక్కుతుందని ఆశించినా.. పదవి దక్కలేదు. భిక్కనూరు మండలానికి చెందిన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డికి చెందిన వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, గీరెడ్డి మహేందర్‌రెడ్డి, కామారెడ్డికి చెందిన న్యాయవాది టి.దేవరాజ్‌గౌడ్ తదితరులు రాష్ట్ర స్థాయి పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యనేతల చుట్టూ..

పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన తమకు పదవులు వస్తాయన్న ఆశతో చాలామంది నాయకులున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడచినా ఇప్పటికీ పదవుల పందేరం మొదలుకాకపోవడంతో నేతల్లో నైరాశ్యం నెలకొంటోంది. పదవుల కోసం ఊహల్లో విహరిస్తున్నవారు ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. ఏదో ఒక పదవి కావాలని తమ రాజకీయ గురువులతో మొరపెట్టుకుంటున్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన నేతలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కలిసి తమకు పదవి ఇప్పించమని కోరుతున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ నేతలు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును, జుక్కల్ నియోజకవర్గ నేతలు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును ఆశ్రయిస్తున్నారు. బాన్సువాడలో రెండు వర్గాలు తమతమ నేతల ద్వారా నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

చదువులు సాగేదెలా?



జుక్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. చదువులు చెప్పేవారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్య తీవ్రంగా ఉంది.

జుక్కల్ మండలంలో 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు, 12 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 3,390 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదు. మండలంలో మొత్తం 235 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా.. 128 మందే ఉన్నారు. ఇందులోనూ 40 మంది ఇటీవల బదిలీపై ఇతర మండలాలకు వెళ్లగా.. కొత్తగా 11 మంది మాత్రమే వచ్చారు. దీంతో ఉపాధ్యాయుల కొరత మరింత పెరిగింది.

సగం పోస్టులు ఖాళీ..
జుక్కల్, పెద్ద ఎడ్గి, హంగర్గ, ఖండేబల్లూర్, కౌలాస్ జెడ్పీ హైస్కూళ్లతో పాటు జుక్కల్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. జుక్కల్ జెడ్పీహైస్కూల్‌లో 663 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ 22 ఉపాధ్యాయ పోస్టులుండగా.. 11 మంది టీచర్లే అందుబాటులో ఉన్నారు. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంగ్లిష్ సబ్జెక్టుకు సంబంధించి నాలుగు ఉపాధ్యాయ పోస్టులకుగాను ఒక్క ఉపాధ్యాయుడూ లేడు. దీంతో ఆంగ్లం బోధించేవారు లేక చదువులు ఆగం అవుతున్నాయి. అంతేకాకుండా ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌లలో రెండు చొప్పున, మ్యాథ్స్, తెలుగు, హిందీ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఒక్కో టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

టీచర్లను నియమించాలి



మా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో చదువులు ఆగం అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే టీచర్లను నియమించి సమస్యను పరిష్కరించాలి.

– నవీన్, ఎనిమిదో తరగతి విద్యార్థి, జుక్కల్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



స్కూల్‌లో సబ్జెక్టు టీచర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యా బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– హన్మంత్‌రెడ్డి, హెచ్‌ఎం, జుక్కల్ జెడ్పీహైస్కూల్

ఎస్సారెస్పీలోకి 52వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 52వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. క్రితం రోజు 41వేల క్యూసెక్కులు వచ్చిన వరద శుక్రవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 52వేల క్యూసెక్కులకు చేరుకుంది. ప్రస్తుత సీజన్‌లో ఇంత స్థాయిలో వరద నీరు రావడం ఇదే తొలిసారి. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూక్కులు, ఆవిరి రూపంలో 443 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా శుక్రవారం రాత్రి వరకు ప్రాజెక్టులో 1079.00 అడుగుల (42 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



నాటు.. సాపాటు..

ఉదయమే పొలానికి వచ్చి నాట్లు వేసి అలసిపోయిన రైతులు, కూలీలు.. పగటి వేళ కాస్త సేదతీరారు. ఇంటినుంచి తెచ్చుకున్న సద్దిమూటలు విప్పి, ఆకలి బాధ తీర్చుకున్నారు. గాంధారి మండలం గుర్జాల్ శివారులో నాట్లు వేసిన అనంతరం కూలీలు, రైతులు కలసి భోజనం చేస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

బతికున్న వ్యక్తి చనిపోయినట్లు..

- తప్పుడు ధ్రువపత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్
- అవాక్కయిన ప్లాట్ యజమాని..
- ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- కామారెడ్డిలో వెలుగు చూసిన మోసం

కామారెడ్డి క్రైం : ప్లాట్ ను కాజేసేందుకు బతికున్న వ్యక్తిని చనిపోయినట్లుగా ధ్రువపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నరాల జీవన్ రెడ్డి అనే వ్యక్తికి కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో 200 గజాల ప్లాట్ ఉంది. గత నెల 26న సదరు ప్లాట్‌ను మరో కాలనీకి చెందిన సాజిద్ హుస్సేన్ ట్రాక్టర్‌తో చదును చేసేందుకు వచ్చాడు. జీవన్ రెడ్డి వెళ్లి ప్రశ్నించగా ఈ ప్లాట్ అబ్దుల్ మోసి అనే వ్యక్తి కొన్నారని, ప్లాట్‌ను మరొకరికి అమ్మడం కోసం చదును చేస్తున్నామని చెప్పి కొన్ని పత్రాలు చూపించాడు. పత్రాలు చూసిన జీవన్ రెడ్డి కంగుతిన్నాడు. అందులో తాను 2012 లోనే చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రాలను, తన కుమార్తె స్థానంలో స్రవంతి అనే మహిళను సృష్టించి కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అబ్దుల్ మోసి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుసుకుని పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి విచారణ జరుపగా అబ్దుల్ మోసితో పాటు నిజామాబాద్‌లో డాక్యుమెంట్ రైటర్‌గా పని చేసే షేక్ అహ్మద్ నబీ, షకీల్ ఫిరోజ్, ఖాజా అబ్బాస్, మహ్మద్ ఉస్మాన్‌లు కలిసి బగ్గాలి స్రవంతిని జీవన్ రెడ్డి కుమార్తెగా చూపించి తప్పుడు మార్గంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడైంది. అబ్దుల్ మోసి, షేక్ అహ్మద్ నబీ, స్రవంతిలను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం' విజయవంతం చేయాలి

- కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలి
- అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం : ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. ఐదు రోజులపాటు పారిశుధ్యం, వైద్య సేవలు, మంచినీటి ట్యాంకుల శుభ్రత, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం, మొక్కలు నాటడం, జ్వర నియంత్రణ చర్యలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కాబట్టి పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాల నిర్వహణకు గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలలో బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు రోజులలో ఏదైనా ఒక రోజు వన మహోత్సవం నిర్వహించాలని, రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తొలగించాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి ఇంటి పరిసరాల్లో నాటేలా చూడాలన్నారు. ప్రతిరోజు చేపట్టిన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన నివేదికలు అందించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం చేపట్టక ముందు చేపట్టిన తరువాత వచ్చిన మార్పుపై డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్ రావు, ఆర్డీవోలు ప్రభాకర్, రంగనాథ్, డీఆర్‌డీవో చందర్, సీపీవో రాజారాం, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

తొలిరోజు చేపట్టే కార్యక్రమాలు..
ఈనెల 5న 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమ ప్రాధాన్యతను తెలియజేసేందుకు గ్రామాలు, పట్టణాల్లో మహిళా సంఘాల సభ్యులు, యువత, ప్రముఖులతో ర్యాలీలు నిర్వహించాలి. గ్రామ, మున్సిపల్ స్థాయిలలో ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలను సేకరించడం, వర్మి కంపోస్ట్ తయారు చేయడం, పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలను శుభ్రపరచాలి. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేయాలి.

రెండోరోజు..
ఈనెల 6న తాగునీటి ట్యాంకులు శుభ్రపరచాలి. ట్యాంకులలో క్లోరినేషన్ చేయాలి. మంచినీటి పరీక్షలు నిర్వహించాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

మూడో రోజు..
ఈనెల 7న మురికి కాలువల పూడిక తీయించాలి. వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి. రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చి రోలింగ్ చేయాలి.

నాలుగో రోజు..
ఈనెల 8న వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, డయేరియా, చికున్ గున్యాలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. మున్సిపల్, పశు సంవర్ధక శాఖల అధికారులు వీధి కుక్కలు సంచరించే ప్రాంతాలను గుర్తించి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో కు.ని. శస్త్ర చికిత్సలు చేయించాలి.

ఐదో రోజు..
ఈనెల 9న ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలి.

'రైతులపై భారం పడనీయం'

సదాశివనగర్: రుణాల విషయంలో రైతుల పై ఎలాంటి భారం పడనీయబోమని అడ్లూ ర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వై స్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు పేర్కొన్నా రు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు ఫ్యాక్టరీకి వెళ్లి వైస్ ప్రెసిడెంట్‌తో సమావేశమయ్యారు. రైతుల పేరు తో ఫ్యాక్టరీ తీసుకున్న రుణాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 15 వరకు రైతుల పేరుతో తీసుకున్న రుణాలను చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, విండో చైర్మన్‌లు కమలాకర్‌రావు, సదాశివరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు సాయాగౌడ్, సృజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో వైస్ ప్రెసిడెంట్‌తో చర్చిస్తున్న రైతులు

క్లుప్తంగా

సర్వీస్ రోడ్డు పునరుద్ధరణ

రామారెడ్డి: గంగమ్మ వాగు వంతెన పక్క నుంచి ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు కుంగిపోయి రాకపోకలు బంద్ కావడంతో ఇటువైపు నుంచి రైతులు మరో వైపు పొలాల్లోకి వెళ్లి పనులు చేసుకోవాలంటే వంద మీటర్ల దూరానికి కన్నాపూర్, పోసానిపేట గ్రామాల మీదుగా తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ గంగమ్మ వాంగు వంతెన సర్వీస్ రోడ్డును పరిశీలించి తాత్కాలికంగా బైకులు, ప్రజలు వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో రైతులకు కొంతమేర ఉపశమనం కలిగింది. పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు గురుకులంలో న్యాయ చైతన్య అవగాహన సదస్సు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సెషన్ జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్ హాజరవుతారని చెప్పారు.

ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాలను శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ పరిపాలనా భవనంలో పరిశీలించారు. తెయూ దోస్త్ కో- ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రవీందర్‌నాయక్, నరేష్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనకు ఎన్‌సీసీ-3, స్పోర్ట్స్ -2, పీహెచ్‌సీ (దివ్యాంగులు) కేటగిరికి సంబంధించి ఒకరు హాజరైనట్లు దోస్త్ కోఆర్డినేటర్ తెలిపారు.



కాస్లాబాద్‌లో..



పిట్లంలో



లింగంపల్లిలో..

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వానా కాలంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య, ఆరోగ్య, గ్రామ పంచాయతీ అధికారులు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షా కాలంలో నీటిని నిలువ ఉండకుండా చూసుకోవాలని, లేకుంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు వేడి చేసిన నీటినే తాగాలని సూచించారు. నిలువ ఉన్న నీటిని పారబోశారు. – సాక్షి నెట్‌వర్క్



వెల్లుట్లపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా బోనాల పండుగ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లికలాన్‌లో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులోని పోచమ్మ అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

బాన్సువాడలో.. పాల్గొన్న కాసుల



బాన్సువాడ:నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం చించొల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన బోనాల పండుగలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బోనాలు అని ఆయన అన్నారు. బీర్కూర్ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, కామారెడ్డి డీసీసీ డెలిగేట్ కాంత్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు రాములు, నార్ల రవీందర్, మోహన్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

భిక్కనూరులో..



భిక్కనూరు: మండల కేంద్రంలో మహేంద్ర మ్యాదిరి సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

వాసవి అమ్మవారికి కమలం పూలతో పూజలు

కామారెడ్డి అర్బన్: ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 1,116 తామర పూల(కమలం) హారంతో అలంకరించి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, ప్రతినిధులు భూమేష్, గరిపల్లి శ్రీధర్, కూర శ్రీనివాస్, వాసవాంబ సేవా సమితి, మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శాకంబరి అమ్మవారుగా కన్యకాపరమేశ్వరి



దోమకొండ: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం–పచ్చదనం'ను విజయవంతం చేయాలి

- ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టనున్న 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా రోజూవారీగా చేపట్టే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 5న కార్యక్రమం ప్రారంభ నేపథ్యంలో గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, యువకులతో ర్యాలీలు చేపట్టి సమావేశాలు నిర్వహించాలన్నారు. 6న తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని, 7న మురికికాలువలను శుభ్రం చేయించడంతో పాటు నీరు నిల్వ ఉన్న గుంతలను పూడ్చించాలన్నారు. 8న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, 9న ప్రభుత్వ కార్యాలయాల వద్ద శుభ్రం చేయించాలని ఆయన సూచించారు. నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభాకరచారి, ఈసీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల కల సాకారం



ఐరేని సందీప్

కామారెడ్డి క్రైం: నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారో, పోస్టింగ్‌లు ఎప్పుడో అనే సందిగ్ధ పరిస్థితుల నుంచి నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు వేసిందని యువజన కాంగ్రెస్ కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధం కావడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా లక్ష్యాన్ని సాధించడం తేలికవుతుందన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీలకు ధన్యవాదాలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ సోమనాథం



మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఏకలవ్య గురుకుల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, స్థానిక ఎస్సై ఆంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ సవితా జైన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన దండుగుల సత్యం (38) అల్లూరి సీతా రామరాజు విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రెండు ఇసుక లారీల పట్టివేత

భిక్కనూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. భిక్కనూరు శివారులోని ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ సమీపంలో రెండు లారీల్లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ డ్రైవర్లు, యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మొరం టిప్పర్..

నవీపేట: మండలంలోని ఫతేనగర్ శివారు నుంచి నవీపేట వైపు వసున్న మొరం టిప్పర్‌ను గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేశామన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి

వర్ని: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమలేడిగి గ్రామానికి చెందిన గాండ్ల సుదర్శన్ (31) ఊర చెరువులో పడి మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన సుదర్శన్ రెండు రోజుల క్రితం చెరువులో పడినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం మృతదేహం తేలడంతో గ్రామస్తులు గమనించి సమాచారం అందించగా విచారణ చేపట్టామన్నారు. మృతిడి తల్లి దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కాలువలో పడి మహిళ..



ఇందల్వాయి: మండలంలోని స్టేషన్ తండా పంచాయతీకి చెందిన కాట్రోత్ భారతి(43) కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. భారతి కాలకృత్యాలు తీర్చుకోడానికి తండా సమీపంలో ఉన్న కాలువ వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు దరిసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మలేషియాలో రాంచంద్రపల్లి వాసి..



మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లికి చెందిన శిరసు వెంకట్(52) మలేషియాలో అనారోగ్యంతో ఈ నెల 1న మృతిచెందాడు. వివరాలు.. వెంకట్ బతుకుదెరువు కోసం మలేషియా వెళ్లాడు. అక్కడ మృతి చెందాడు. మృతదేహాన్ని త్వరగా రప్పించాలని ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చేపలవేటకు వెళ్లి ఒకరు..

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఎండీ మౌలానా (55) చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం గ్రామ శివారులోని నీటి కుంటలో మృతదేహం కనిపించగా గ్రామస్తులు పోలీసులకు సమచారం అందించారు. చేపలు పట్టడానికి వెళ్లి చనిపోయి ఉంటాడని మృతుని భార్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికపై లైంగిక దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ కాలనీలో ఐదున్నర ఏళ్ల బాలికపై అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ మేకల కాపరి(40) లైంగిక దాడి చేసినట్లు ఎస్సై రామ్ తెలిపారు. గురువారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలిని ఢీకొన్న స్కూల్ బస్సు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట్‌లో పారిశుధ్య కార్మికురాలిని స్కూల్ బస్సు ఢీకొంది. వివరాలు.. గ్రామానికి చెందిన యంబ లక్ష్మి(58) పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. శుక్రవారం ఉదయం రోడ్డు ఊడుస్తుండగా కాకతీయ స్కూల్ బస్సు ఢీకొంది. ఆమె కాలికి గాయం కాగా నిజామాబాద్ తరలించారు. లక్ష్మి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

- 15 మంది నుంచి రూ.8.45 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్ట్



నిందితుడు ప్రవీణ్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉండే చిలుక నవీన్ ఎంఎస్ఎన్ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేస్తున్న సుంచు ప్రవీణ్ తనకు తెలిసిన వారు చాలా మంది ఉన్నారని, ప్రభుత్వ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నవీన్‌ను నమ్మించాడు. నవీన్, అతని భార్య జ్యోతితో పాటు వారి స్నేహితులు, బంధువులు మొత్తం 15 మంది నుంచి ప్రవీణ్ మొత్తం రూ.8.45 లక్షలు వసూలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌లు అంటగట్టాడు. మోసపోయామని గ్రహించి జ్యోతి పట్టణ పోలీసులకు గత నెల 22న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు ప్రవీణ్‌ను మెదక్ జిల్లా నిజాంపేట మండలం బచ్చురాజులపల్లి వాసిగా గుర్తించారు. ప్రస్తుతం అతడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. విలాసాలకు అలవాటు పడి తేలికగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు ప్రవీణ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి



రాజేశ్వర్ మృతదేహం

కామారెడ్డి క్రైం: నైట్ డ్యూటీకి వెళ్తూ బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన డ్రైనేజీని ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ శివారులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం నాగ్లూర్ గ్రామానికి చెందిన గైని రాజేశ్వర్ (34) భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్దనున్న ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే గురువారం రాత్రి నాగ్లూర్ నుంచి బైక్‌పై నైట్ డ్యూటీకని బయలు దేరాడు. 11 గంటల ప్రాంతంలో టేక్రియాల్ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న ఫ్లైవర్ బ్రిడ్జి పక్కన డ్రైయినేజీని ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని పోలీసులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ధర్పల్లి మండలం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన అల్లం అశోక్(33) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. వివరాలు.. అశోక్ అతని స్నేహితులు బాబు, లక్ష్మణ్‌తో కలిసి ఇందల్వాయికి పాత సామాను కొనుగోలు కోసం ట్రాలీ ఆటోలో వచ్చాడు. తిరిగి వెళ్తుండగా వారి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ అశోక్‌ను జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంటైనర్ ఢీకొని యువకుడు..



ఆనంద్ కుమార్ (ఫైల్)

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్ శివారు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామానికి చెందిన కట్ట ఆనంద్‌కుమార్(29) కొంత కాలంగా ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌లో డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు.

విధి నిర్వహణలో భాగంగా రెడ్డిపేట్ నుంచి సదాశివనగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆనంద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, రెండేళ్ల పాప ఉంది. ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంజిత్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో : ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన బైక్

బాల్కొండ: బాల్కొండ మండలం కిసానగర్‌లో పాత జాతీయ రహదారి 44పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన అము, అతని భార్య సోని, కుమారుడు ఓంకార్ బైక్‌పై ఆర్మూర్ నుంచి నాగాపూర్ వెళ్తుండగా వెనుక నుంచి టాటా మాజిక్ ఆటో ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి సౌత్‌క్యాంపస్ విద్యార్థి..



ప్రీతమ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కామారెడ్డిలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా సాంగ్వి గ్రామానికి చెందిన బేడక్కర్ ప్రీతమ్ (27) భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఉంటూ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనులపై శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చాడు. అతడు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా థియేటర్ రోడ్ క్రాసింగ్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి ప్రీతమ్ మృతిచెందాడు. పట్టణ పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా ప్రీతమ్ తండ్రి రాంకిషన్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ప్రీతమ్ మృతితో సౌత్‌క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.


ఖాతాదారుల లోన్లు కాజేసిన బ్యాంక్ మేనేజర్ రిమాండ్

ఖలీల్‌వాడి: ఖాతాదారులకు లోన్లు ఇచ్చి ఆ డబ్బులను కాజేసిన నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద గల బడా బజార్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ పినపాటి అజయ్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. అజయ్ కొంత మంది కస్టమర్లను నమ్మించి లోన్లు ఇప్పించి వారి వద్ద సుమారు రూ.3 కోట్ల డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ డబ్బులను ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టినట్లు చెప్పారు. దీంతో పాటు కొంతమంది ఖాతాదారులు షూరిటీ నిమిత్తం ఇచ్చిన చెక్కులను పెట్టుకొని ఖాతాదారులకు తెలియకుండా వారి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. బాధితుడు పుల్లూరి రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించినట్లు తెలిపారు. అజయ్‌కుమార్‌ను గురువారం సాయంత్రం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పట్టుకొని విచారించిన తర్వాత కోర్టులో హాజరు పర్చామని వివరించారు.

కాపర్ వైర్ చోరీ

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం తెల్లవారు జామున దొంగలు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. ఈ ఘటనపై రైతులు మైపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి అదృశ్యం



మోపాల్: మండలంలోని మంచిప్ప తండాకు చెందిన మాలావత్ సంతోష్ గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు.. సంతోష్, ప్రమీల దంపతులు. సంతోష్ అటవీశాఖలో వాచర్ (తాత్కాలిక పద్ధతిన)గా పని చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో యువకుడు..



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని బతుకమ్మకుంట కాలనీకి చెందిన మహ్మద్ ఫిరోజ్ అహ్మద్(29) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాలా చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి రజియబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.